# హృదయాలతో ఆట



**రాలినూతలకృష్ణ**

శశికళతో పరిచయం కాకపోతే రఘు పరిస్థితి ఇట్లా వుండేదే కాదు. నిరాశ నిస్పృహలు అతనిలో చోటు చేసుకొనేవే కావేమో! ఇవ్వన్నీ అతని జీవితంలో రాకూడదని అతని కోరిక! కాని అవే అతన్ని చుట్టుముట్టాయి. ఎప్పుడూ కళ గురించే ఆలోచిస్తూ వుంటాడు. కొద్దిసేపు తీయని జ్ఞాపకాలతో మునిగిపోతూ, మరికొంతసేపు మరపురాని బాధతో క్రుగ్గిపోతూ వుంటాడు.

'కళ ఎందుకిలా చేసింది? ఆమెను కోరుకున్న వాళ్లందర్నీ ఇలాగే మోసం చేసిందా? చేస్తే వాళ్లంతా తనలాగే బాధపడ్తున్నారా?...' ఇటువంటి ఆలోచనలతో తన్నుతానే ప్రశ్నించుకొంటూ, పిచ్చివాడై పోతున్నాడు రఘు. కాని పరిష్కారం మాత్రం తోచటం లేదు.

ఆరోజు ఆదివారం... ఆఫీసు లేదు. ఒక్కడే రూమ్‌లో పడుకొని గత జ్ఞాపకాల్ని నెమరువేసుకొంటున్నాడు రఘు. ఒక ఆదివారం సంధ్యా

సమయంలో పార్కులో... కళ ఒడిలో తాను పడు కొన్నప్పుడు...

"రఘూ నన్నెప్పటికీ మర్చిపోవుగా?"

"ఎందుకట్లానుకుంటావ్ కళా?" అతని లాలింపు.

"నన్ను నీదాన్ని చేసుకుంటావా?" ఆమె ఆవేదన.

"తప్పకుండా చేసుకుంటా కళ! ఎప్పుడో చేసుకోవడమేంటి? నీ వెప్పుడూ నా దానివేగా!"

కొంటెగా నవ్వింది కళ!

"నీ వెప్పుడూ ఇలాగే నవ్వుతూ వుండాలి. నీ కౌగిలిలో నే కరిగిపోతూ ఎటువంటి కష్టాన్నైనా ఎదుర్కోగలను కళా! ఆ ధైర్యం నాకుంది...!"

గేటు తీసిన చప్పుడైంది. మళ్లీ వాస్తవ ప్రపంచంలోకి వచ్చాడు రఘు.

"ఏం గురూ! ఇంకా పడుకున్నావ్?" అంటూ మధు అడిగాడు.

"ఏం లేదురా! ఏం తోచక పడుకున్నాలే..."

"ఏం తోచకపోతే ఏదైనా పిక్చర్ కెళ్దామా?"

"............"

"అదీగాక ఎప్పుడూ అలా ఆ కళ గురించే ఆలోచిస్తూ వుండకపోతే..." అంటూ అనుమానంగా అడిగాడు.

మౌనంగా తలవంచుకు కూర్చున్నాడు రఘు.

"ఇంకా ఎందుకురా! ఆమెను గురించే ఆలోచిస్తావ్! అయినా నీ పిచ్చిగాని, ఆమెను నువ్వు ప్రేమ దేవతగా భావించావు. కనీసం ఆమెకు నువ్వు గుర్తు కూడా వుండవు. ఆమె నిన్నొక సాధారణ పరిచయస్తుడ్నిగానే పరిగణిస్తుంది. మరి నువ్వా..."

"నువ్వు చెప్పిందంతా నిజమే కావచ్చురా! కానీ...ఆమెను మర్చిపోలేనురా! ఆమె ఎటువంటిదనే విషయాన్ని ఇంతవరకు ఆలోచించలేదు. కాని ఆమె నాకు మిగిల్చిన అనుభూతిని మాత్రం మరువలేనురా!"

"ఆమె సాంగత్యం మరపురానిదై వుండవచ్చు. నేను కాదనను. కాని ఆమె హృదయంలో నీ స్థానమెంతో కనీసం ఆలోచించావా? ఆమెను గురించి ఇంకా ఆలోచించటం మూర్ఖత్వమే అవుతుందిరా!" అన్నాడు మధు.

"నువ్వెన్ని చెప్పినా ఆమెను మరువలేనురా! ఆమె లేకుండా వుండలేనురా!"



పార్కులో
"నీ కళ్ళల్లో నాకు ప్రపంచం మొత్తం కనిపిస్తుంది ప్రియా!" తమకంగా అన్నాడు ప్రియుడు.
"అయితే తప్పిపోయిన నా గొర్రె ఎక్కడుందో చూసిపెట్టండి బాబయ్యా!" అన్నాడు అప్పుడే అక్కడికి వచ్చిన దానయ్య.
—సాహితి, (సందికొట్కూరు)

"అయితే సరే కాని! ఎవడి పిచ్చి... వాడికానందం. నీ ఖర్మ! అనుభవించు! ఇంతకీ సెంటర్ దాకానన్న వస్తావా...?" విసుగ్గా అడిగాడు మధు.

"ఇప్పుడెక్కడికి రానులేరా! ప్లీజ్! డోన్ట్ డిస్టర్బ్ మీ!"

"ఆమెనే తల్చుకొంటూ పడుకో...! నే వెళ్లొస్తా!" హేళనగా అంటూ వెళ్లిపోయాడు.

"మధు చెప్పినదాంట్లో నిజం లేకపోలేదు. ఆమె హృదిలో తనకంటూ ప్రత్యేక స్థానమేదీ లేదు! అయితే తనే ఆమెను ఆరాధిస్తున్నాడు. ఇప్పటికీ కూడా! ఎప్పటికప్పుడు ఆమెను మర్చిపోవాలనుకుంటూనే వున్నాడు. కాని మర్చిపోలేక పోతున్నాడు.

★ ★ ★

శశికళ, రఘూ క్లాస్‌మేట్స్. రఘు ఫైనల్ బి.కాం. చదువుతున్నప్పుడు ఆమెతో అతనికి పరిచయమైంది. కళ సరదాగా కబుర్లు చెప్పేది. ఆమె మాటలు అతన్ని ఎంతో ఆకర్షించేవి. తన హృదయ కవాటంలో ఆమెకొక ప్రత్యేక స్థానాన్ని ఏర్పర్చుకున్నాడు రఘు. వాళ్లిద్దరి పరిచయం కాస్త స్నేహంగా మారింది.

అతని ఒక్కరోజుకూడా ఆమెను చూడకుండా వుండలేకపోయేవాడు. ప్రతిరోజూ ఇద్దరూ కలిసే కబుర్లు చెప్పుకొంటూ కాలేజీనుంచి ఇంటికెళ్లేవారు. నడుస్తున్నంతసేపు కళ అతన్ని నవ్విస్తూ...కవ్విస్తూ వుండేది.

"నేను నిన్ను ప్రేమిస్తున్నా కళా! నిన్నే పెళ్లి చేసుకుంటా! నువ్వు కాదంటే నా జీవితాన్ని చాలిస్తా! ప్లీజ్! కాదనవు కదూ!" అంటూ సినిమా ఫక్కీలో అర్థించాడొకరోజు.

నవ్వి ఊరుకుందామె.

ఆమె నవ్వును అర్థం చేసుకోలేక పోయాడతడు. ఆమె కూడా తనంటే ఇష్టపడుతున్నదనే అనుకొన్నాడు. మరోమారు ఆమె అభిప్రాయాన్ని తెలుసుకుందామని మళ్లీ అడిగాడు.

"ఐయామ్ రెడీ టూ మ్యారీ యూ రఘూ! కాని...మీరు నన్ను అర్థం చేసుకోవాల్సింది చాలావుంది!" అని కిలకిల మంటూ గండుకోయిలలా నవ్వింది.

కళ నవ్వుతూ వుంటె గలగలా సెలయేరు పారుతున్నట్లు, గుండుమల్లెలు విచ్చుకున్నట్లుంటుంది. ఆ కిలకిలా నవ్వే అతన్ని ఊహాలోకాల్లోకి తీసుకెళ్లి, గాలిమేడల్ని నిర్మించింది. ఆ ఊహలే అతడ్ని ఆమెకు మరింత దగ్గర చేశాయి.

★ ★ ★

రఘు—శశికళల స్నేహం గురించి రఘు స్నేహితుల్లో ఒకరిద్దరికి చూచాయగా తెల్సింది. కానీ కొంతకాలం దాకా దాన్ని గూర్చి ఎవరూ పట్టించుకోలేదు.

కార్తీకమాసం వనభోజనాల సందర్భంగా రఘు తన స్నేహితులతో కలసి గార్డెన్ కెళ్లాడు.

"ఏంరా రఘూ! నీ ప్రేమ వ్యవహారం ఎంత దాకా వచ్చిందేమిటి?" ఒంటరిగా ఉన్నప్పుడు అడిగాడు మధు.

ఊహించని ప్రశ్నకు ఆశ్చర్యపోయాడు రఘు!

"నీకెలా తెల్సిందాని ఆశ్చర్యపోతున్నావురా? ఇలాంటి విషయాలు ఎవరూ చెప్పకుండానే తెలుస్తూ వుంటాయిలే! అయినా ప్రతి విషయాన్ని దాచకుండా నాతో చెప్పేవాడివి, ఈ సంగతెందుకు చెప్పలేదు రా?" సూటిగా అడిగాడు మధు.


"అది...అది..." నానుస్తూ..."అవకాశం రాలేదురా!" సమాధానమిచ్చాడు.

"అవకాశముంటె...?"

"..............."

"చెప్పాలనే ఆలోచన రాలేదని అర్థమా? అయితే ఆమెను నువ్వు మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నావా? పెళ్లి చేసుకోవాలనుకుంటున్నావా...?" అంటూ గుచ్చి గుచ్చి అడిగాడు.

"ఆపరేషన్ చేసేప్పుడువంటి బాధ కలగకుండా ఇంజక్షన్ ఇస్తాను. ఎటొచ్చీ బిల్లు ఇచ్చేటప్పుడు మీకు బాధకలగొచ్చు" అన్నాడు హాస్యప్రియుడైన డాక్టరు.
"అలా అయితే ఆ ఇంజక్షన్ ఏదో బిల్లు ఇచ్చేటప్పుడే ఇవ్వండి డాక్టర్ ప్లీజ్!? బ్రతిమాలాడు అమాయకరావు.
—సాహితి, (సందికొట్కూరు)



అవునన్నట్లుగా తలూపాడు రఘు!

"ఆ పెళ్లి జరక్కపోతే...?"

"ఏం...? ఎందుకు జరగదు?" అనుమానంగా అడిగాడు రఘు.

"జరిగితే మంచిదే! ఒకవేళ జరక్కపోతే..."

"ఏమౌతుందోన్న విషయాన్ని గురించి నేనాలోచించలేదురా! ఎందుకంటే... మా ప్రేమ అంత బలవత్తరమైంది కనుక. అయినా కళంటె నాకు ప్రాణం! ఆమెలేని జీవితాన్ని నేను ఊహించుకోలేను. ఎవరినైనా వదులుకొంటాగాని,,, ఆమెను మాత్రం విడిచి వుండలేనురా! అంతే కాదు— ఆమెకు నేనంటే అమితమైన ప్రేమ, అభిమానం, అనురాగం. నన్ను చూడకుండా ఆమె ఒక్కరోజు కూడా వుండలేదు. కనుక మేమిద్దరం విడిపోవడమనేది కలలో కూడా జరగదు" గర్వంగా చెప్పాడు రఘు.

"శశికళలో వున్న 'కళ' నీకు పూర్తిగా అర్థం కాలేదన్న మాట!" వ్యంగ్యంగా అన్నాడు మధు.

"అంటే...?" నువ్వునేదేంటో నా కర్థం కావటం లేదురా!"

"నీ కర్థంకాదులే! నేను చెప్పినట్లు నువ్వొ పని చేయి. అప్పుడు నీకే అర్థమౌతుంది".

"ఏమిటది...?"

"రేపు నువ్వామెను కల్సుకున్నప్పుడు నేను ఆమెకు తెలుసేమో అడుగు! ఆమె దగ్గర నా ప్రస్తావన తీసుకురా! కాని నీకు నాకు స్నేహం వున్నదని మాత్రం ఆమెకు తెలియకుండా, మామూలుగా పరిచయస్తుల మన్నట్లుగా చెప్పు! అప్పుడు ఆమె రియాక్షన్స్ గమనించి, ఆమె ఏమంటుందో నాకు చెప్పు. ఆ తర్వాత ఏం చేయాల్సింది నీకు నేను చెప్తా!"

"నిన్న ఎక్కడి కెళ్లారు?" అడింగింది కళ.

"ఫ్రెండ్స్‌తో చిన్న పిక్నిక్ ప్రోగ్రాం వేశాం".

"ఎవరెవరు వెళ్లారు?"

"నీకు తెలియదులే వాళ్లు" అంటూ కొంత మంది పేర్లు వాళ్ల వివరాలు చెప్పి, మధు గురించి కొంచెం ఎక్కువగా చెప్పాడు.

"మధూ...అంటే... సన్నగా ఎర్రగా వుంటాడు. వాళ్ల ఫాదర్ రిటైర్డ్ ఇంజనీర్, వాళ్ల బ్రదరొకతను డాక్టర్ అనుకుంటా!... అతనేనా...? హడావిడిగా అడిగింది కళ.

అవునన్నట్లుగా తలూపి, ఆమె వంక పరీక్షగా చూశాడు.

ఆమె తలవంచుకొని నడుస్తోంది.

"అతను నీకెలా తెల్సు?" సిగరెట్టు వెల్గించుకొంటూ అడిగాడు రఘు.

"పరిచయముంది" పొడిగా సమాధానమిచ్చింది.

"ఎట్లాతెలుసు...?"

"మా బ్రదర్, అతను క్లాస్‌మెట్స్!"

"మధు చాలా మంచివాడు కళా! మంచి జీనియస్! ఇంకా ఏదేదో చెప్పుకుపోతున్నాడు రఘు.

"ఆ:...నాకు తెల్సు!" ఆమె మాటల్లో, ముఖంలో అయిష్టత స్పష్టంగా కనపడుతోంది.

టాపిక్ మార్చేందుకు... "ఇంకేమైనా కబుర్లు చెప్పండి! అయినా ఫ్రెండ్స్ అంటే అందరూ ఫ్రెండ్స్ కాదు! అందరితో అతిగా తిరక్కూడదు!" చిరుకోపంతో అంది.

"నువ్వెవరితో స్నేహం చేయమంటే వాళ్లతోనే స్నేహం చేస్తా కళా! నీ యిష్టమే నా యిష్టం! సరేనా...!"

దానికి బదులుగా నవ్విందామె.

★ ★ ★

'మధు ఎందుకలా అన్నాడు? అతనికి ఆమె గురించి ఇదివరకే ఏదో తెల్సివుండాలి!' అనుకున్నాడు. ఆలోచనలతో మెదడు మొద్దుబారిపోతోంది. రేపు ఉదయాన్నే మధుని కలిసి ఆమె అన్నమాటలని అతనితో చెప్పాలని నిర్ణయించుకున్నాడు.

"హలో మధూ!" అంటూ నవ్వుతూ పల్కరించాడు రఘు.

"హలో! ఏమైంది నేను చెప్పింది?"

శశికళకు తనకు జరిగిన సంభాషణంతా పూసగుచ్చినట్లు చెప్పాడు.

అంతా విని "రఘూ! ఒక్కసారి మా ఇంటికి రారా!" ఆదేశిస్తున్నట్లుగా అన్నాడు మధు. మౌనంగా మధుని అనుసరించాడు.

రఘును లోపలకు తీసుకెళ్లి బీరువాలోంచి ఒక కవరు తీసిచ్చాడు మధు.

రఘు గుండెలు బరువెక్కాయి. ఏదో తపన— ఆవేదన! ఆతృత! అందులోవున్న లెటర్ తీసి చదవటం మొదలెట్టాడు.

డియర్ మధూ!,

నిన్నే పెళ్లి చేసుకుంటానని— నీతోటే ఏడడుగులు నడుస్తానని చెప్పాను. నిన్ను నవ్వించాను— కవ్వించాను. నీ కెన్నో ఆశలు కల్పించాను. నీతో ఎంతో ఆత్మీయతతో మెలిగాను. కాని నాకో చిత్రమైన కోరిక వుంది. నా కోసం ఎందరో కలవరించాలని— నన్నే మనసులో చెరగని ముద్రగా వుండిపోవాలని— ఇలా నన్నెందరో అభిమానించి—ఆరాధించాలని వుంది. అలా వుండాలనుకున్న వాళ్లల్లో నువ్వొకడివి! ఎప్పటికీ గుర్తుంచుకుంటావు కదూ!

ఇంకో ముఖ్య విషయం! నా ఉద్దేశంలో ప్రేమ వేరు— పెళ్లి వేరు! అందుకే ప్రేమదేవతగా నిల్చిపోవాలని వుంది. నన్నర్థం చేసుకుంటావని ఆశిస్తూ..."

ఎప్పటికీ...<br>
నీ...<br>
కళ!

★ ★ ★

శశికళలో వున్న 'కళ' అది.

అయస్కాంతంలాంటి ఆకర్షణ! సరదాగా హృదయాలతో ఆడుకోవటం అది ఆమె సరదానో లేక అలవాటో రఘుకు ఏమాత్రం అంతుపట్టలేదు.

●



బిచ్చగాడి బొచ్చెలో వందనోటు వేశాడు సుబ్బారావు.

నీ జాలిగుణానికి ఆశ్చర్యపోతున్నానోయి బిచ్చగాడికి వంద రూపాయలా వేసేది!

అది వడ్డీలే... అసలు ఎప్పుడు తీరుతుందో ఏమో చెప్పాడు సుబ్బారావు.

పి. అవంతి<br>
హైదరాబాద్



నా పెళ్లయినప్పట్నుంచి సుశీల ఒక్కసారి కూడా ప్రేమగా పలకరించలేదు.

అదేంట్రా అంతగాఢంగా ప్రేమించుకునేవాళ్లుగా మీరు?

అదే నాకూ అర్థం కావడం లేదు కనీసం నా పెళ్లికన్నా రాలేదు. చల్లగా చెప్పాడు అప్పారావు.

పి. గిరిధర్<br>
హైదరాబాద్